## అన్న క్యాంటీన్లలో పరిశుభ్రత తప్పనిసరి--

**జిల్లా కలెక్టర్ జి రాజకుమారి గణియా---**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 28 :–నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, భోజనశాల, ఆహార తయారీ విధానం, పరిశుభ్రతను పరిశీలించారు. అన్న క్యాంటీన్లలో నిర్ణీత సమయానికి నాణ్యమైన భోజనం అందించాలని, శుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ప్రభుత్వం నిర్దేశించిన విధంగా తప్పనిసరిగా అందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా టోకెన్ తీసుకొని భోజనం చేసి, భోజన నాణ్యతపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

## వసతి గృహ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 28 :–వసతి గృహాలలో నివసిస్తున్న విద్యార్థులను వార్డెన్లు, సిబ్బంది సొంత బిడ్డల్లా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా సూచించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని ఎన్జీవో కాలనీలో ఉన్న ప్రభుత్వ మైనార్టీ బాలుర వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో భోజన నాణ్యత, పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం తప్పనిసరిగా అందించాలని, పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. టాయిలెట్లు, బాత్రూంలు ప్రతిరోజూ శుభ్రపరిచి పారిశుధ్య లోపాలు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్, క్రమశిక్షణతో చదువులో ముందుకు సాగి లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో వసతి గృహ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.

## అన్నప్రసాద షెడ్డు పనులకు శ్రీకారం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 28–ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని అన్నప్రసాద వితరణ ప్రాంగణంలో 15 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న షెడ్డు పనులకు బుధవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి ఐరన్ స్తంభాలు నిలబెట్టారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, ఏ వి ఆర్ కళాశాల అధినేత వెంకట్రాం రెడ్డి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు సిద్ధం శివరాం, 12వ వార్డు కౌన్సిలర్ శ్యాంసుందర్ లాల్, ఆర్యవైశ్య జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్ గుప్తా, భూపనపాడు సంజీవ్ కుమార్ పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ సమితి సభ్యులు, దేవస్థానం అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు చెందిన కూరగాయల వ్యాపారి ప్రసాద్తో పాటు రామకృష్ణారెడ్డి, సంజీవ్ కుమార్ షెడ్డు నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించారు. మార్చి నెల నుంచి సంకట చతుర్థి రోజున వినాయక స్వామి పూజలు నిర్వహించడంతో పాటు పూజలకు హాజరయ్యే మహిళలకు అన్నప్రసాద సమితి ఆధ్వర్యంలో అల్పాహార వితరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు దేవస్థానం కమిటీ చైర్మన్ చలం బాబు తెలిపారు.



## కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 28–పట్టణంలో వీధి కుక్కలపై ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతిరోజూ 25 నుంచి 30 వరకు



కుక్కల ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, కుక్కల సంఖ్య అధికంగా ఉండటంతో కొంత ఆలస్యం జరుగుతోందని చెప్పారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని పట్టణంలో కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి అక్కడికక్కడే కుక్కలకు ర్యాబీస్ వ్యాక్సినేషన్ ప్రక్రియను రేపటినుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వారం బుధవారం, గురువారం, శుక్రవారం ర్యాబీస్ వ్యాక్సినేషన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సోమవారం, మంగళవారం, శనివారం రోజుల్లో కుక్కల ఆపరేషన్లు కొనసాగుతాయని వెల్లడించారు. ర్యాబీస్ వ్యాక్సినేషన్ వేయడం వల్ల కుక్క కరిచిన సందర్భాల్లో ప్రజలకు పెద్ద ప్రమాదం ఏమీ ఉండదని కమిషనర్ స్పష్టం చేశారు. అందువల్ల ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. పట్టణంలో ఎక్కువగా కుక్కలు ఉన్న ప్రాంతాల వివరాలను ప్రజలు శానిటేషన్ సూపర్వైజర్ మురళీధర్, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి లేదా ఇతర మున్సిపల్ సిబ్బందికి వెంటనే తెలియజేయాలని కమిషనర్ కోరారు. ప్రజల సహకారంతో కుక్కల సమస్యను సమర్థవంతంగా నియంత్రిస్తామని ఆయన తెలిపారు.

## గ్రూప్ 2 సాధించిన ఆర్ఎస్సై ని అభినందించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.



విభారే న్యూస్ జనవరి 28 కర్నూలు జిల్లా ప్రతినిధి..పోలీసు శాఖలో రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్సై)గా మేడగమ్ సురేష్ రెడ్డి విధులు నిర్వహిస్తూ, ఇటీవల నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్ – 2 ఫలితాలలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏ ఎస్ ఓ) గా ఎంపికైన సంధర్బంగా కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కర్నూలు ఎస్పీ ఆర్ఎస్సై ని అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కఠినమైన విధి నిర్వహణతో పాటు పోటీ పరీక్షలలో విజయం సాధించడం ప్రశంసనీయమన్నారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ కూడా ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఈ విజయం ద్వారా నిరూపితమైందని పేర్కొన్నారు. ఇది ఇతర పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. భవిష్యత్తులో లక్ష్యమైన గ్రూప్ –1 ను కూడా ఇదే పట్టుదల, కృషితో సాధించాలని కర్నూలు ఎస్పీ ఆకాంక్షించారు. ఆర్ఎస్సై నేపథ్యం..ఎమ్. సురేష్ రెడ్డి 2015 లో ఆర్ఎస్సై గా పోలీసు శాఖలో చేరారు. బి. టెక్ పూర్తి చేశారు. అనంతపురం జిల్లా, తాడిపత్రి మండలం, బొందలదిన్నె గ్రామం కు చెందిన వ్యక్తి. తల్లిదండ్రులు – ఎమ్. వెంకట రామిరెడ్డి , ఎమ్. వెంకట సుబ్బమ్మ , వ్యవసాయ కుటుంబం. 2025 ఫిబ్రవరి 23 న నిర్వహించిన గ్రూప్ 2 ( హాల్ టికెట్ –112003120 ) మెయిన్స్ పరీక్షలో మొత్తం 300 మార్కుల గాను 230 మార్కులు సాధించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయం (సెక్రటెరియేట్) లో ఏ ఎస్ ఓ ఉద్యోగం సాధించారు.

## 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో కర్నూలు జిల్లా మంచి స్థానంలో ఉండాలి

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



కర్నూలు, జనవరి 28:- రానున్న 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో కర్నూలు జిల్లా మంచి స్థానంలో నిలవాలని, ఇందుకోసం విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి తెలిపారు..బుధవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డివిజన్ లోని మండల విద్యాశాఖ అధికారులు , హెడ్ మాస్టర్ లతో 10 వ తరగతి 100 రోజుల కార్యాచరణ అమలు పై డివిజన్ స్థాయి సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంతకు ముందు కర్నూలు జిల్లా 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే చివరి స్థానాల్లో ఉండడం వల్ల జిల్లా ప్రతిష్ట దెబ్బతింటోందని , రానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో కర్నూలు జిల్లా మంచి స్థానంలో ఉంచాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు.. తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడికి పంపేలా ప్రోత్సహించడం వల్ల, ఉపాధ్యాయుల నిరంతర కృషి వల్ల వలసలకు వెళ్లిన విద్యార్థుల సంఖ్యను తగ్గించి వెనక్కు తీసుకొని రావడం జరిగిందన్నారు.. ప్రస్తుతం 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో 60వ రోజు నడుస్తోందని, మిగిలిన 40 రోజులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులు బలహీనంగా ఉన్న సబ్జెక్టులపై ఎక్కువ దృష్టి సారించి చదివించాలన్నారు. రాబోయే 48 రోజుల్లో కష్టపడి పని చేసి పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాకు మంచి ర్యాంక్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లీప్ యాప్ లో విద్యార్థుల మార్కుల నమోదు చేయడంలో పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కర్నూలు జిల్లాలో అక్షరాస్యత కేవలం 57% మాత్రమే ఉందని, ఇది జాతీయ సగటు కంటే తక్కువ అన్నారు. జిల్లాలో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు. జిల్లాలో 1,61,000 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారికి శిక్షణ ఇచ్చి అక్షరాస్యులుగా తీసుకురావాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలో డ్రాపౌట్స్ తగ్గాలని, అక్షరాస్యత పెరగాలని కలెక్టర్ తెలిపారు. ఐ వి ఆర్ ఎస్ ఫీడ్ బ్యాక్ లో పురోగతి తీసుకొని రావాలిమధ్యాహ్న భోజన నాణ్యత బాగుండేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. హెడ్ మాస్టర్లు పేరెంట్స్ తో వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి, సంబంధిత గ్రూప్ లో విద్యార్థులకు ప్రతిరోజూ పెడుతున్న భోజనం ఫోటోలు, పారిశుధ్య నిర్వహణ ఫోటోలు, సిలబస్ అప్‌డేట్స్ వివరాలను పంపాలన్నారు. చిక్కీ (అప్ట్రతిఎనెతి) ప్యాకెట్లపై ఉన్న ఎక్స్‌పైరీ డేట్ గురించి పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, తయారీ తేదీ నుండి 3 నెలల వరకు వాడుకోవచ్చు అనే అంశంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

## రైతులకు నోటీసులు ఇచ్చిన తర్వాతనే సర్వేకు వెళ్లాలి

**పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో మంచి స్థానంలోకి రావాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**



కర్నూలు / పత్తికొండ , జనవరి 28: రైతులకు నోటీసులు ఇచ్చిన తర్వాతనే సర్వేకు వెళ్లాలని పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో మంచి స్థానానికి రావాలని పత్తికొండ రెవెన్యూ డివిజన్ సర్వే సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి. ఆదేశించారు. బుధవారం పత్తికొండ టిటిడి ఫంక్షన్ హాల్ లో పత్తికొండ రెవిన్యూ డివిజన్ కు చెందిన తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సర్వేకు వెళ్లే ముందు సంబంధించిన వ్యక్తులకు కచ్చితంగా సర్వేకు సంబంధించిన నోటీసులు అందించాలన్నారు. నిర్ణీత సమయానికి సర్వేకు వెళ్లాలని, సర్వే చేసిన తర్వాత సంబంధించిన రిపోర్టును ఇచ్చి ఫోటో తీసుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, డబ్బు వసూలు చేయకూడదని జిల్లా కలెక్టర్ మండల సర్వేయర్లు , వీఆర్వోలు , విలేజ్ సర్వేయర్లు తదితరులను ఆదేశించారు. ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ లో ఈ అంశంపై పై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ... ఒకసారి నోటీసు ఇచ్చి సర్వేకు వెళ్లకపోతే , రెండోసారి తప్పకుండ నోటీసు ఇచ్చి మాత్రమే సర్వేకు వెళ్లాలని ఆదేశించారు. ఇచ్చిన నోటీసు ప్రకారం అదే తారీఖున ఖచ్చితంగా సర్వే కు వెళ్లాలని ఆదేశించారు. నిబంధనలకు మేరకు పని చేయకపోతే వారిపై చర్యలు తప్పవని, నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని జేసీ ఆదేశించారు. సమావేశం లో పత్తికొండ ఆర్డిఓ భరత నాయక్ , తహసిల్దార్ హుస్సేన్ సాహెబ్ , పత్తికొండ రెవిన్యూ డివిజన్ కి చెందిన సర్వేయర్లు , వీఆర్వోలు , విలేజ్ సర్వేయర్లు మొదలగు సిబ్బంది హాజరయ్యారు.

## క్రీడా ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తా.

**తెదేపా యువ నాయకుడు గౌతమ్ రెడ్డి**



.కర్నూల్ స్పోర్ట్స్, సత్తెనపల్లి లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ లో జిల్లా క్రీడాకారులు రాణించాలని జిల్లా తెదేపా యువ నాయకుడు గౌతమ్ రెడ్డి. వ్యాఖ్యానించారు. బుధవారం నగరంలోని గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్లే గ్రౌండ్లో నిర్వహించిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ క్రీడాకారుల పోటీల ఎంపిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోటీల్లో గెలవటం ఓటమి చెందడం సహజమేనన్నారు. అయితే తమ క్రీడ నైపుణ్యతలను చూపించి పోటీల్లో పాల్గొనటమే ప్రధానమని ఆయన అన్నారు. షూటింగ్ బాల్ క్రీడకు ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ గుర్తింపు లభించటం సంతోషమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, జిల్లా సంఘం ప్రతినిధులు మధుసుధన్, కాశినాథ్ ,అమృత, కిరణ్ కుమార్, రమ్య , తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథి రామాంజనేయులు బాలుర విభాగంలో విజేత అయిన గుడ్ షెఫర్డ్ స్కూలుకు బాలికల విభాగంలో మొదటి స్థానము సంపాదించిన కంబలపాడు ఏ.పీ.ఎస్. డబ్ల్యు. ఆర్ విద్యార్థులకు కప్పుతో పాటు ప్రశంస పత్రాలు మెడల్స్ ను అందజేసి అభినందించారు.

## అజిత్ పవార్ మృతిపై మంత్రివర్గం సంతాపం

అమరావతి,ఏపీ కేబినెట్ భేటీ ప్రారంభ సమయంలో అజిత్ పవార్ విమాన ప్రమాద ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించారు. ఈ ప్రమాదంలో

అజిత్ పవార్ తో సహా ఐదుగురు చనిపోవడంపై ఏపీ మంత్రి మండలి సంతాపం తెలిపింది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి మృతికి సంతాపం తెలుపుతూ క్యాబినెట్ భేటీలో తీర్మానం చేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**